క్లుప్తంగా

సామాజిక సమతా సభకు 8 బస్సులు

మండవల్లి: విజయవాడలో శుక్రవారం జరుగనున్న సామాజిక సమతా సభకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో మండవల్లి మండలం నుంచి 8 బస్సులు బయలుదేరతాయని ఈఓపీర్డీ ఏ.ఆనందబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ స్వరాజ్‌మైదానంలో 206 అడుగుల అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

అర్చకులకు నూతన వస్త్రాల పంపిణీ



తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యాన అర్చకులకు నూతన వస్త్రాల పంపిణీ గురువారం జరిగింది. తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయం, శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు స్థానికంగా ఉన్న పలు ఆలయాల అర్చకులకు వైఎస్సార్ సీపీ నాయకులు నూతన వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట హరిప్రసాద్, సచివాలయ కన్వీనర్ కిలారం రామకృష్ణ, కన్స్యూమర్ సొసైటీ చైర్మన్ రావులపల్లి శ్రీనివాస్, నాయకులు గోనేపల్లి శ్రీనివాసరావు, లంక శ్రీనివాసరావు, ఆసిఫ్, బుడే, లల్లా, గణేష్ పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లిలో అక్షింతలు పంపిణీ



జమీగొల్వేపల్లి(పామర్రు): మండల పరిధి జమీగొల్వేపల్లిలో అయోధ్య రాముని అక్షింతలను గురువారం పంపిణీ చేశారు. రామాలయం నుంచి పవిత్ర అక్షింతలను తీసుకుని ఊరేగింపుగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి మహిళలు అందజేశారు. అయోధ్యలోని రాముల వారి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 22వ తేదీన జరుగుతుందని, ఆ రోజున స్వామి వారి అక్షింతలకు విశేషంగా పూజలు చేసి తలపై వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వి.కనకవల్లి, తిరుమలాచార్యుల దంపతులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు కూరగాయల విక్రయం



ముదినేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయ సాగుతో పండించిన కూరగాయలను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం విక్రయించారు. ప్రతి సోమ, గురువారాల్లో ఈ సాగుతో పండించిన కూరలను ప్రకృతి సాగు సీఆర్పీ ఆధ్వర్యంలో విక్రయిస్తున్నారు. ఈ కూరలకు ప్రజల నుంచి డిమాండ్ వస్తుండడంతో వీటితో పాటు గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ నుంచి కొనుగోలు చేసిన పసుపు, బెల్లం వంటి వస్తువులను విక్రయిస్తున్నారు. వీటికి ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తున్నట్లు సీఆర్పీ గౌతమ్‌కుమార్ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పామర్రు: స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల గురువారం ఆవిష్కరించారు. సమాజ సేవలో దైవ సేవకుల పాత్ర అనే డిబేట్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవలో దైవ సేవకులు కీలక పాత్ర పోషించాలన్నారు. అనేక మందిని సన్మార్గులుగా మారుస్తూ మంచి మార్గంలో నడిపిస్తున్నారని చెప్పారు. అనేక సేవా కార్యక్రమాల్లో దైవ సేవకులు పాల్గొంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, క్షమ గుణాలు కల్గి ఉండేలా బోధనలు చేయాలని సూచించారు. టి.సాలెం రాజు, వై.సంగీత రావు, ఎస్.శామ్యూల్, జి.సత్యకుమార్, సాగర్, వరప్రసాదరావు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పీఏసీఎస్ సాయం

మాజేరు(చల్లపల్లి): రైతు కుటుంబానికి మాజేరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరుకు చెందిన సొసైటీ సభ్య రైతు తమ్ము చంద్రరావు (60) ఇటీవల మరణించారు. సొసైటీ చైర్‌పర్సన్ అరజా శివశంకర్ సొసైటీ తరపున రూ.10వేలు ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. సొసైటీ సీఈఓ ఎస్ఎస్ చక్రపాణి, పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యం

- పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ
- గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలే కీలకం
- ఈ నెలాఖరులోగా ఈ – గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి



పమిడిముక్కలలో శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వేదికపై ఏఓ రాజు, కార్యదర్శి సునీత

పమిడిముక్కల: ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. 2024 – 25 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు, ఏఓ రాజు, కార్యదర్శి బండారు సునీత కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకొని అమలు పరిచే బాధ్యత గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్‌లపై ఉందన్నారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీ విధానం..

ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే వివిధ స్థాయిల్లో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి. మొదట గ్రామసభ జరిపి ఆ వివరాలను జీపీడీపీ యాప్‌లో నమోదు చేయాలి. పంచాయతీ సొంత ఆదాయం, కేంద్ర ఆర్థిక సంఘ నిధులు, ఇతర ప్రాయోజిత కార్యక్రమాలు ఆదాయ వనరుల అంచనాలు తయారు చేసుకోవాలి. ముసాయిదా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ, రెండో గ్రామసభ నిర్వహించి ముసాయిదా ప్రణాళికపై చర్చించి ఆమోదం పొందాలి. మండల స్థాయి బృందంచే పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక తయారీ పరిశీలన, లోటుపాట్లను విశ్లేషించి, సరి చేసుకోవాలి. గ్రామ పంచాయతీ సమావేశంలో ఆమోదం పొందిన అభివృద్ధి ప్రణాళికను ఈ నెల 31వ తేదీలోగా ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలి.



ముదినేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

కార్యాచరణ కమిటీలు..

సహజ వనరుల కమిటీ వ్యవసాయం, తోటల పెంపకం, పశుపోషణ, చేపల పెంపకం, నీటి వనరులు, సహజ వనరులకు సంబంధించిన అభివృద్ధి, పరిరక్షణ అంశాలపై పని చేస్తుంది. మానవ వనరుల కార్యచరణ కమిటీ విద్య, ఆరోగ్యం, మహిళా, శిశు సంక్షేమం, మానవ వనరుల అభివృద్ధి కోసం పనిచేస్తుంది. ఉపాధి కల్పన, స్వయం సహాయక బృందాల కార్యచరణ కమిటీ స్వయం సహాయక బృందాల ఏర్పాటు, జీవనోపాధుల ఏర్పాటు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పన వంటి లక్ష్యంగా పని చేస్తుంది.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల థీమ్‌ల ఏర్పాటు..

2024–25 సంవత్సరంలో 9 థీమ్‌లలో ప్రతి గ్రామం ఒక థీమ్‌ను ఎంచుకోవాలి. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యకరమైన గ్రామం, బాలల స్నేహపూర్వక గ్రామం, సమృద్ధిగా నీరు, పరిశుభ్రత, హరిత గ్రామం, స్వయం సమృద్ధిగా మూలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళల స్నేహపూర్వక గ్రామంలో ప్రతి పంచాయతీ ఏదో ఒక థీమ్‌ను తప్పనిసరిగా ఎంపిక చేసుకోవాలి.

పరిగణనలోకి తీసుకోవాల్సిన పథకాలు..

అంత్యోదయ అన్నయోజన, పోషణ అభియాన్, జల జీవన్ మిషన్, జనని సురక్ష యోజన, ఉపాధి హామీ పథకం, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సమగ్ర శిక్షా అభియాన్, స్వచ్ఛభారత్ మిషన్ తదితర పథకాలను ప్రణాళికల తయారీలో పరిగణనలోకి తీసుకోవాలి.

నిధుల కేటాయింపు..

గ్రామ పంచాయతీకి లభించే సొంత ఆదాయం, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి పథకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా లభించే నిధులు ప్రధాన ఆదాయ వనరులు. సొంత ఆర్థిక వనరులలో సిబ్బంది వేతనాలకు 30 నుంచి 50 శాతం, పారిశుద్ధ్యానికి 15 శాతం, వీధి దీపాలకు 15 శాతం, మంచినీటి సరఫరాకు 15 శాతం, రోడ్లు, కల్వర్టులకు 10 శాతం, విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి 10 శాతం నిధులు ఖర్చు చేయాలి. 15వ ఆర్థిక సంఘ నిధులలో బేసిక్ గ్రాంట్ 40 శాతం రోడ్ల నిర్మాణానికి, టైడ్ గ్రాంట్ 60 శాతం పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు ఉపయోగించాలి.

సరైన ప్రణాళికలతోనే అభివృద్ధి

ముదినేపల్లి రూరల్: సరైన ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికకు సంబంధించి స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధులు పంచాయతీలకు వస్తున్న నిధులు, ఆదాయ వనరులను పరిగణనలోనికి తీసుకొని చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి సమష్టిగా నిర్ణయించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ డెవలెప్‌మెంట్ ప్లాన్ ప్రాముఖ్యతను వివరించారు. ఇందులో సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, కార్యదర్శులు సమైఖ్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ, ఏఓ రమణబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు, కో ఆప్షన్ సభ్యులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



గుడివాడలో అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో మాజీ ముఖ్యమంత్రి, సినీనటుడు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను పార్టీలకతీతంగా గురువారం నిర్వహించారు. స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం సెంటర్‌లో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానాన్ని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ.. పేదలకు ఆకలి తీర్చాలనే లక్ష్యంతో కిలో రూ.2కు బియ్యం అందజేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. అట్టి మహానుభావుడిని స్మరించుకుంటూ పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. ఎన్టీ రామారావును ఇప్పటికీ పేదలు గుర్తుచేసుకోవడం ఆయన గొప్పతనమని కొనియాడారు.

పామర్రు నియోజకవర్గంలో..

పామర్రు/మొవ్వ: పామర్రులోని నాలుగు రోడ్ల కూడలి, కొమరవోలు, నిమ్మకూరు, మొవ్వ గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. మొవ్వలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించి, టీడీపీ జెండాను ఆవిష్కరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్టీఆర్ వర్ధంతి

గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకుల మధ్య ఎటువంటి గొడవలు, కొట్లాటలు జరగలేదని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ తెలిపారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఉదయం 10.45 గంటలకు ఇచ్చి నివాళులర్పించారన్నారు. టీడీపీ నేత వెనిగండ్ల రాము ఆ పార్టీ నాయకులతో కలిసి మధ్యాహ్నం 12.15 గంటలకు స్టేడియం వద్దకు వచ్చారని చెప్పారు. ఈ క్రమంలో సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ర్యాలీగా కొత్త మున్సిపల్ కార్యాలయం వద్దకు రాగా అదే సమయంలో టీడీపీ నాయకుడు వెనిగండ్ల రాము పార్టీ నాయకులు, జనసేన నాయకులతో కలసి రావడంతో ఎదురెదురుగా పడి ఒకరినొకరు కవ్వించుకుని రెచ్చగొట్టుకుంటూ గొడవ చేయడానికి ప్రయత్నించగా ఇరువర్గాలను సమయస్ఫూర్తితో నిలువరించామన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని, గొడవలు తలెత్తకుండా ఇరువర్గాల వారిని అక్కడ నుంచి పంపించేశామని చెప్పారు. సకాలంలో పోలీసులు స్పందించి విధులు సక్రమంగా నిర్వహించడం వలన ఎటువంటి ఘర్షణలు, గొడవలు, కొట్లాటలు జరలేదని డీఎస్పీ స్పష్టం చేశారు. గుడివాడలో లా అండ్ ఆర్డర్‌కు ప్రాబ్లమ్ వచ్చిందని చేస్తున్న ప్రచారంలో నిజం లేదని, అటువంటి మాటలను ప్రజలు నమ్మొద్దని డీఎస్పీ సూచించారు. సమావేశంలో టూ టౌన్ సీఐ బి.తులసీధర్, పోలీసులు పాల్గొన్నారు.



గుడివాడలో మాట్లాడుతున్న డీఎస్పీ పి.శ్రీకాంత్ పక్కన సీఐ తులసీధర్ తదితరులు

ముగిసిన సిలువ పండుగ

అడ్డాడ(పామర్రు): ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ ఆయన బోధనలను అనుసరించాలని దైవజనులు క్రీస్తు రాయబారి పేర్కొన్నారు. మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలో సిలువ మిషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సిలువ పండుగ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. కార్యక్రమానికి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ రాష్ట్రాలతో పాటు గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొని సాక్ష్యాలను ఇచ్చారు. ఈ సందర్భంగా క్రీస్తు రాయబారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శాంతి, క్షమ, దయ గుణాలను కలిగి ఉంటూ సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. ప్రభువైన క్రీస్తు బోధనలను అనుసరిస్తూ తన వలే తన పొరుగు వారిని ప్రేమించాలని సూచించారు. దైవజనురాలు లూధియానా మాట్లాడుతూ ఎంతో మంది విశ్వాసులకు ప్రభువు సాక్ష్యాలను ఇచ్చి వారిని ఆదుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తి పాటలు విశ్వాసులను ఆనందపరిచాయి. కార్యక్రమంలో పాస్టర్లు ప్రభు, మిల్కిషదక్(రామకృష్ణ), అకుల్లా(ప్రసాద్), సత్యం, విజయ్‌శేఖర్, అబ్రహాం, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న దైవజనులు క్రీస్తు రాయబారి, పక్కన లూథియానా

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు



ముదినేపల్లిరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముదినేపల్లి, గురజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీల సమావేశాలు గురువారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు విశ్వాసం పెరిగే విధంగా వైద్యులు, సిబ్బంది సేవలందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ మాట్లాడుతూ గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో వ్యాధులను అరికట్టాలన్నారు. వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన పెంచి అప్రమత్తం చేయాలని చెప్పారు. సమావేశాల్లో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

మండవల్లి: కానుకొల్లులో లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ సొసైటీ కంట్రోల్ పర్యవేక్షణలో చైల్డ్ ఫండ్ ఇండియా సమావేశం గురువారం నిర్వహించారు. సూపర్‌వైజర్ రాజేష్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ నాగదాసి థామస్, లింక్‌వర్కర్ సీహెచ్ నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో యోగా శిక్షణ తరగతులు

యార్లగడ్డ(చల్లపల్లి): ఏపీ – ఆయుష్ శాఖ సహకారంతో త్వరలో యోగా శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు చల్లపల్లి మండల హోమియో వైద్యాధికారి డాక్టర్ డి.రవినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యార్లగడ్డ హోమియో వైద్యశాలలో పురుష ట్రైనర్, మహిళా ట్రైనర్‌ను నియమించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు.

పేదల అభ్యున్నతితోనే దేశం పురోభివృద్ధి సాధిస్తుంది

ఎంపీపీ గద్దె పుష్పరాణి

గుడివాడరూరల్: పేద వర్గాల అభ్యున్నతితోనే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని ఎంపీపీ గద్దె పుష్పరాణి పేర్కొన్నారు. మండలంలోని కల్వపూడి అగ్రహారం, పర్నాస గ్రామాల్లో సర్పంచ్‌లు పోటూరి వెంకటేశ్వరమ్మ, గొర్ల రాజేష్‌ల ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్పయాత్ర, హర్ ఘర్ జల్ ఉత్సవ గ్రామసభలను గురువారం నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పేదవర్గాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నాయన్నారు. గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పేరిట స్వచ్ఛమైన తాగునీరును ప్రజలకు అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం..

ఎంపీడీఓ అనగాని వెంకటరమణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధి చేకూర్చడానికే వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తోందన్నారు. 2047 సంవత్సరానికల్లా దేశాన్ని వికసిత భారత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలను గ్రామాల్లో పేద ప్రజలు అందరికీ తెలియచేసి వాటి లబ్ధి పొందేలా చేయడమే వికసిత భారత్ సంకల్పయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, గుంటాకోడూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఏలేటి ఆంజనేయులు(అగస్టిన్), వెలుగు ఏపీఎం డి.సాంబశివరావు, నాయకులు పోటూరి శ్రీమన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



వికసిత సంకల్ప యాత్ర గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులకు సూచించారు. ఆయన గురువారం రాత్రి జిల్లాలోని ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవ నిర్వహణ, రాబోయే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు పెద్ద ఎత్తున ర్యాలీలు, మానవహారాలు నిర్వహించాలన్నారు. యువ ఓటర్లు, వృద్ధ ఓటర్లను సత్కరించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే విధంగా ప్రజలకు అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్నింటిలో ఫర్నిచర్, ర్యాంప్‌లు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, మౌలిక వసతులు కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. వీసీలో డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో డీఆర్వో పెద్ది రోజా

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



మండల స్థాయి క్రికెట్ విజేత అగినపర్రు టీమ్



మొవ్వలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పమిడిముక్కల: గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పమిడిముక్కల మండల స్థాయి క్రికెట్ పోటీలో అగినపర్రు సచివాలయం టీమ్ సత్తా చాటింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మేడూరు టీమ్‌పై అగినపర్రు టీమ్ గెలుపొందింది. క్రికెట్ పోటీలను ఎస్ఐ కిషోర్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, పీడీ రవీంద్ర పర్యవేక్షించారు. విజేత టీమ్‌ను మామిళ్లపల్లి సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, అగినపర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్ అభినందించారు.

ఉత్కంఠంగా మ్యాచ్‌లు

మొవ్వ: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గురువారం మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రికెట్ పోటీలు నువ్వా.. నేనా అన్న రీతిలో ఉత్కంఠంగా సాగాయి. కూచిపూడి వర్సెస్ నిడుమోలు, కాజ–2 వర్సెస్ పెడసనగల్లు, భట్లపెనుమర్రు వర్సెస్ వేములమడ, పెదపూడి వర్సెస్ అవురుపూడి సచివాలయాల టీమ్‌లు తలపడ్డాయి. మొవ్వ క్రీడా అధికారి అప్పికట్ల రామారావు పర్యవేక్షణలో సాగుతున్న ఈ పోటీల్లో మండల స్థాయి సెమీ ఫైనల్ మ్యాచ్‌లను శుక్రవారం నిర్వహించనున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ ఝాన్సీ తదితరులు

మండవల్లిలో ఆటల పోటీలు

మండవల్లి: మండల స్థాయి బాలికల ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు రెండో రోజు గురువారం మండవల్లి హైస్కూల్‌లో ఉత్సాహంగా సాగాయి. కబడ్డీ పోటీల్లో లింగాల – చింతపాడు జట్లు తలపడగా చింతపాడు విజేతగా నిలిచింది. షటిల్ పోటీలో మండవల్లి జట్టుపై కానుకొల్లు జట్టు విజయం సాధించింది. అలాగే వాలీబాల్ పోటీలో అయ్యవారిరుద్రవరం జట్టుపై లింగాల జట్టు గెలిచింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఎ.ఆనందబాబు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడల ద్వారా ఆణిముత్యాల్లాంటి గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెండా ఝాన్సీ, నాయకులు మెండా సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, పీడీ సుబ్బారావు, పీఈటీ వేణు, సెక్రటరీ తోట శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో జీవన ప్రమాణాల పెంపు

కృత్తివెన్ను: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని వికసిత భారత సంకల్పయాత్రలో బృంద ప్రతినిధులు తెలిపారు. మండల పరిధిలోని నీలిపూడి, మునిపెడ గ్రామ పంచాయతీల్లో గురువారం వికసిత భారత్ యాత్ర గ్రామ సభలు నిర్వహించారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను వివరిస్తూ వాటితో కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ప్రచార వాహన కో ఆర్డినేటర్లు, ఎంపీడీఓ పిచ్చిబాబు, నీలిపూడి సర్పంచ్ పాశం కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెంటి సతీష్, పాశం రాము, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మ సంబరం

గూడూరు: స్థానిక గంగానమ్మ సంబరం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లు వారి వీధి నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. డీజే వాయిద్యాల నడుమ మేళతాళాలతో ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. అనంతరం గంగానమ్మ ఆలయం వద్ద అమ్మవారికి భక్తులు మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో గూడూరులో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

గుడివాడటౌన్: విజయవాడ స్వరాజ్య మైదానంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణకు గుడివాడ నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో మొత్తం 10 బస్సులు ఏర్పాటు చేశామని, మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్ణీత వార్డుల్లో ఆ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం తిరిగి అదే వార్డులకు చేర్చేలా ఏర్పాటు చేశామన్నారు. అంబేడ్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో విజయవాడకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, సీహెచ్ జోషి, సీహెచ్ నాని, తోట రాజేష్, పాస్టర్ కృపాకర్, వి.రామకృష్ణ, కృష్ణ, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు